జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.




| బుధవారం 15 ఏప్రిల్ 2026 | పేజీలు : 05 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 317 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

# అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం – యంగ్ ఇండియా పాఠశాలకు శంకుస్థాపన

## కాంగ్రెస్ కార్యకర్తలకు మంత్రి పిలుపు





సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 15, ప్రతినిధి: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు కల్లూరు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం సిద్ధాంతాలు దేశానికి మార్గదర్శకాలని అన్నారు. ఇదే సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలం చెన్నూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మొదటి విడతలో 70 నియోజకవర్గాల్లో సుమారు 200 కోట్లతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైందని తెలిపారు. పేదల సంక్షేమం కోసం ఉచిత కరెంట్, రేషన్ కార్డులు, ఉద్యోగాలు, రుణమాఫీ, రైతు భరోసా, ఇండ్లు వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలో సత్తుపల్లి నియోజకవర్గంలో మూడు పెద్ద ఆసుపత్రులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని కార్యకర్తలు గడప గడపకూ తీసుకెళ్లాలని, ప్రజల్లోకి మరింతగా వివరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని, కార్యకర్తల కృషితోనే ప్రజాపాలన సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు.




# కేటీఆర్ హెచ్చరికతో అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం తెరుచుకుంది

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రతినిధి: నగరంలోని 125 అడుగుల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని రెండున్నరేళ్లుగా మూసివేయడంపై రాజకీయ వివాదం నెలకొన్న నేపథ్యంలో, ప్రతిపక్ష నేత కేటీఆర్ చేసిన హెచ్చరికల తర్వాత ప్రభుత్వం తాళాలు తీసినట్లు సమాచారం. బీఆర్ఎస్ వర్గాలు దీనిని తమ నైతిక విజయంగా అభివర్ణిస్తూ, అంబేద్కర్ మహనీయుడికి జరిగిన అన్యాయానికి ఇది ముగింపు అని పేర్కొన్నాయి. కాగా కాంగ్రెస్ నాయకులు మాత్రం భద్రతా కారణాల దృష్ట్యా తీసుకున్న చర్యలను ఇప్పుడు సవరించామని చెబుతున్నారు. ఈ పరిణామంతో అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం ప్రజలకు మళ్లీ అందుబాటులోకి వచ్చింది.

# తెలంగాణ న్యాయస్థానాల ఉత్తర్వులు అందరికీ వర్తిస్తాయని ధర్మాసనం వ్యాఖ్య

# హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆంక్షలు.. విధివిధానాలు పాటించాలని ఆదేశం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రతినిధి: హైడ్రా నిర్వహిస్తున్న కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు న్యాయవర్గాల్లో సమాచారం వెలువడింది. ఐలాపూర్ కూల్చివేతలపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు తాత్కాలికంగా కూల్చివేతలను నిలిపివేయాలని సూచిస్తూ, చట్టపరమైన విధివిధానాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడం సరైంది కాదని కోర్టు వ్యాఖ్యానించినట్లు సమాచారం. చెరువులు, జలాశయాలు, మురుగు కాలువలు, రహదారుల వంటి ప్రజా ప్రయోజన అంశాలకు సంబంధించిన కేసుల్లో మాత్రమే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు న్యాయవర్గాలు పేర్కొన్నాయి. అలాగే హైడ్రా ప్రామాణిక కార్యాచరణ విధానం ఏమిటో వివరించాలని కోర్టు ఆదేశించినట్లు తెలుస్తోంది. అధికారుల చర్యలు కోర్టు ఆదేశాలకు లోబడి ఉండాల్సిందేనని, భూ వివాదాల్లో న్యాయస్థానాల ఉత్తర్వులు అందరికీ వర్తిస్తాయని ధర్మాసనం స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే ఈ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ఉత్తర్వుల ప్రతులు వెలువడాల్సి ఉంది.



# ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణ.. పశ్చిమాసియా పరిస్థితులపై కీలక చర్చ



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 15, ప్రతినిధి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ దాదాపు 40 నిమిషాల పాటు ఫోన్‌లో కీలకంగా మాట్లాడినట్లు సమాచారం. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో ఈ సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, శాంతి చర్చల విఫలం, అంతర్జాతీయ భద్రతా పరిస్థితులపై ఇద్దరు నాయకులు చర్చించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన సముద్ర మార్గాల భద్రత, ప్రాంతీయ శాంతి స్థిరత్వంపై అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది. అయితే ఈ సంభాషణలో తీసుకున్న నిర్ణయాలు, తదుపరి చర్యలపై అధికారిక వివరాలు ఇంకా వెల్లడికాలేదు.

# నియోజకవర్గాల పెంపుపై విస్తృత చర్చలు అవసరం – ప్రధానికి సీఎం లేఖ



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రతినిధి: నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా జాతీయ స్థాయిలో విస్తృత చర్చలు జరపాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలతో ఏకాభిప్రాయం సాధించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహిళల రిజర్వేషన్, డిలిమిటేషన్, లోక్‌సభ సీట్ల పెంపు మూడు వేర్వేరు అంశాలని, వాటిని కలిపి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 543 సీట్లలోనే 33 శాతం మహిళల రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని, సీట్ల సంఖ్య పెంచకుండా డిలిమిటేషన్ చేపట్టాలని సూచించారు. లోక్‌సభ సీట్లను 850కు పెంచే ప్రతిపాదన వివాదాస్పదమని, ప్రోరాటా పద్ధతిలో అమలు చేస్తే దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు నష్టపోతాయని, ఉత్తరాది రాష్ట్రాలు లాభపడే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో హైబ్రిడ్ మోడల్‌ను ప్రత్యామ్నాయంగా సూచిస్తూ, సీట్లలో సగాన్ని ప్రోరాటా పద్ధతిలో, మిగతా సగాన్ని ఆర్థిక అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా కేటాయించాలని ప్రతిపాదించారు. దేశ సమగ్రత, సమాన ప్రాతినిధ్యం దృష్ట్యా అన్ని రాష్ట్రాల సహకారంతో ఒక స్థిరమైన పరిష్కారం అవసరమని సీఎం లేఖలో పేర్కొన్నారు.

# హర్మూజ్ జలసంధి దిగ్బంధనంపై సందేహాలు.. ఇరాన్‌కు నష్టం అంచనాలేనా?








**● అంతర్జాతీయ వార్త** సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 15, ప్రతినిధి: అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ ఓడరేవులను అమెరికా దిగ్బంధించిందన్న వార్తలపై స్పష్టత లోపిస్తున్నట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ మేరకు సంచలన నిర్ణయం తీసుకున్నారని కొన్ని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించినప్పటికీ, దీనిపై అధికారిక ధృవీకరణ పూర్తిగా వెలువడలేదు. రోజుకు సుమారు 435 మిలియన్ డాలర్లు (రూ.4 వేల కోట్లకు పైగా) నష్టం వాటిల్లవచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నా, ఇవి పరిస్థితులపై ఆధారపడి ఉండే ఊహాగానాలేనని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఇలాంటి పూర్తి స్థాయి దిగ్బంధనాన్ని అమలు చేయడం సాంకేతికంగా, వ్యూహాత్మకంగా క్లిష్టమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కొంతమేర ఎగుమతులు కొనసాగించే అవకాశం ఉందని, ఇప్పటికే సముద్ర మార్గంలో ఉన్న చమురు నిల్వలు తాత్కాలిక ఉపశమనం కలిగించవచ్చని సూచిస్తున్నారు. మొత్తం మీద ఈ దిగ్బంధన వార్తల్లో కొంత వాస్తవం ఉన్నప్పటికీ, పూర్తి స్థాయి అమలు, నష్టం పరిమాణంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి.

# అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు పోవాలి: వాణి ప్రసాద్




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రతినిధి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపించిన మార్గంలో సమాజం మొత్తం ముందుకు సాగాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలుగు లలిత కళా తోరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని అంబేద్కర్ చలనచిత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజమైన ప్రగతి అంటే అన్ని వర్గాలకు సమానంగా అందే అభివృద్ధి అని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లో మరింతగా వ్యాప్తి చేసేందుకు ఇలాంటి చలనచిత్రాలను ప్రతి ఒక్కరూ చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పురావస్తు శాఖ సంచాలకులు అర్జున్ రావు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, సలహా మండలి సభ్యులు దినకర్, పల్లె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వానికి శాశ్వత దీప్తి అంబేద్కర్ జయంతి ఘనంగా



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 15, ప్రతినిధి: భారత రాజ్యాంగ శిల్పి, సామాజిక న్యాయానికి ప్రతీక అయిన డాక్టర్ భీమ్రావ్ రామ్‌జీ అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఘనంగా నివాళులు అర్పించారు. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే మహాసిద్ధాంతాలకు జీవం పోసిన మహామానవుడిగా అంబేద్కర్ గారిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్‌లోని మహూలో జన్మించిన అంబేద్కర్ చిన్ననాటి నుంచే అస్పృశ్యత, వివక్షను ఎదుర్కొన్నప్పటికీ విద్యనే ఆయుధంగా చేసుకొని ప్రపంచస్థాయి విద్యను అభ్యసించి సమాజ మార్పుకు పునాది వేశారు. కొలంబియా యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లలో ఉన్నత విద్యను అభ్యసించి న్యాయవేత్తగా, ఆర్థికవేత్తగా, సామాజిక సంస్కర్తగా విశేష కీర్తి పొందారు. భారత రాజ్యాంగ రూపకల్పన కమిటీ చైర్మన్‌గా ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించి మౌలిక హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలకు బలమైన పునాది వేశారు. దళితుల హక్కుల కోసం, మహిళల సమాన హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. మహాడ్ సత్యాగ్రహం, పూణే ఒప్పందం వంటి ఉద్యమాల ద్వారా సామాజిక విప్లవానికి నాంది పలికారు. 1956లో నాగపూర్‌లో బౌద్ధమతాన్ని స్వీకరించడం ద్వారా సామాజిక విముక్తి సందేశాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా చైత్యభూమి సహా పలు ప్రాంతాల్లో నివాళి కార్యక్రమాలు, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. "విద్య పొందండి, సంఘటితంగా ఉండండి, పోరాడండి" అనే ఆయన సందేశం నేటికీ ప్రతి భారతీయుడికి మార్గదర్శకంగా నిలుస్తోంది. అంబేద్కర్ గారి ఆశయాలను ఆచరణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కోదాడలో ఘనంగా అంబేద్కర్ జయంతి ర్యాలీ





సందేశం టైమ్స్, కోదాడ, ఏప్రిల్ 15, ప్రతినిధి కొండలు: కోదాడ పట్టణంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, స్థానిక నాయకులు, మున్సిపాలిటీ చైర్మన్ ఎర్నేని బాబు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖమ్మం క్రాస్ రోడ్ నుండి శకుంతల థియేటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం, ఆయన ఆశయాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ ర్యాలీకి పట్టణ సిఐ శివశంకర్ నాయక్, ఎస్ఐ సుధీర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

# రోడ్డు భద్రతపై ప్రమాణం చేయించిన కోదాడ పోలీసులు



సందేశం టైమ్స్, కోదాడ, ఏప్రిల్ 15, ప్రతినిధి కొండలు: అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా కోదాడ పట్టణంలో పోలీసులు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ సిఐ శంకర్ నాయక్, ఎస్ఐ సుధీర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు భద్రత నియమాల ప్రాముఖ్యతను వివరించారు. అతివేగంగా వాహనాలు నడపరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్డు మీద ప్రయాణించే పిల్లలు, పెద్దలు సురక్షితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరితో రోడ్డు భద్రతపై ప్రమాణం చేయిస్తూ ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేశారు.

# ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలికి అండగా నిలిచిన పోలీసులు



సందేశం టైమ్స్, కోదాడ, ఏప్రిల్ 15, సూర్యాపేట జిల్లా ప్రతినిధి కొండలు: కోదాడ పట్టణంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఎస్సై సుధీర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పర్యవేక్షణలో ఉండగా, రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని ఓ బైక్ ఢీకొని వెళ్లిపోయింది. వెంటనే స్పందించిన ఎస్సై సుధీర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావును అప్రమత్తం చేసి బైక్ నంబర్ వివరాలు సేకరించి, నిందితుడి కోసం చర్యలు ప్రారంభించారు. ప్రమాదంలో వృద్ధురాలికి కాలు విరగడంతో వెంటనే ఆమెను సందేశం టైమ్స్ ప్రతినిధి కొండలు సహకారంతో సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చేశారు. పోలీసుల ఈ తక్షణ స్పందనపై స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేశారు.





# అంగన్వాడీ కేంద్రంలో జంక్ ఫుడ్‌పై అవగాహన కార్యక్రమం

సందేశం టైమ్స్, నాగులవంచ, ఏప్రిల్ 15, ప్రతినిధి: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని గడివి అంగన్వాడీ కేంద్రంలో జంక్ ఫుడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "జంక్ ఫుడ్ వద్దు – ఆరోగ్యం ముద్దు" అనే నినాదంతో పిల్లలకు, తల్లిదండ్రులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. చిరుధాన్యాలు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ చంద్రకళ, ఆయా నాగమణి, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సహపంక్తి భోజనంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 15, ప్రతినిధి: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సహపంక్తి భోజన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో కలిసి కూర్చొని భోజనం చేస్తూ సమానత్వం అనే అంబేద్కర్ ఆశయాలను ప్రతిబింబించారు. సమాజంలో ఉన్న భేదాలను తొలగించి అందరూ ఒకే వేదికపై కలిసేలా చేయాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భట్టి విక్రమార్క ప్రజలతో ఆత్మీయంగా మమేకమై, అంబేద్కర్ చూపించిన సమానత్వ మార్గాన్ని ఆచరణలో చూపించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని కూడా స్పష్టంగా తెలియజేశారు.

# విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక సమానత్వం సాధ్యం: కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 15, ప్రతినిధి: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపించిన మార్గంలో విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక సమానత్వం సాధ్యమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో విగ్రహానికి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సమానత్వం, విద్య, స్వాభిమానం అనే విలువలపై ఆధారపడి ఉన్నాయని, యువత ఆయన బాటలో నడిచి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్య ద్వారా మాత్రమే ఆర్థిక అసమానతలను తొలగించవచ్చని, చదువు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి ఇతరులకు కూడా తెలియజేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా మహిళలు, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించబడినట్లు తెలిపారు. రాజ్యాంగంలోని ప్రతి ఆర్టికల్ ప్రజల హక్కులు, బాధ్యతలు, సమానత్వం, సామాజిక న్యాయాన్ని పరిరక్షించేందుకు కీలకమని పేర్కొన్నారు. అంబేద్కర్ దూరదృష్టి వల్లే దేశం ప్రజాస్వామ్య విలువలతో ముందుకు సాగుతోందని కొనియాడారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సామాజిక న్యాయం సాధనలో ప్రతి పౌరుడి పాత్ర ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నేతల పుష్పాంజలి



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రతినిధి: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, వీ. శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ తదితర ప్రముఖులు సచివాలయం సమీపంలోని 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను స్మరించుకుని ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఆర్.వి. మహేందర్, గజ్జెల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, అందోల్ మండల్, ఏప్రిల్ 15, ప్రతినిధి: జోగిపేట పట్టణంలో భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు సమర్పించి గౌరవ నివాళులు అర్పించారు. కార్యక్రమం ప్రారంభంలో విగ్రహాన్ని శుభ్రపరిచి పూలతో అలంకరించి, చిత్రపటానికి దీపప్రజ్వలన చేసి నివాళులు ఘనంగా చెల్లించారు. ఈ కార్యక్రమంలో మండల్ టౌన్ అధ్యక్షురాలు పావని, కో-కన్వీనర్ సుమన్, పోసనిపేట వార్డు సభ్యుడు వి. వెంకటేశం, టౌన్ ప్రధాన కార్యదర్శి పాపయ్య, భూమయ్య, యాదగిరి, జగన్నాథం, అఖిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రతి భారతీయుడి హక్కులను కాపాడే గొప్ప పత్రంగా నిలిచిందని, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ విలువలను స్థాపించేందుకు ఆయన చేసిన కృషి అపారమని కొనియాడారు. యువత అంబేద్కర్ ఆశయాలను అవగాహన చేసుకుని విద్య ద్వారా అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు.



## అంబేద్కర్ సమానత్వానికి ప్రతీక: మహ్మద్ అబ్బూ అలీ ఖురేషీ

సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం డివిజన్‌లోని ఎస్.ఎన్. కాలనీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు మహ్మద్ అబ్బూ అలీ ఖురేషీ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప మేధావి, ఎవరికీ బానిస కాకుండా సమానత్వాన్ని ప్రతిష్ఠించిన మహానుభావుడని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరిని సమానంగా గుర్తించిన ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.

## మేడికుందలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మేడికుంద గ్రామ పంచాయతీ కార్యాలయంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఉపసర్పంచ్ నిర్మల, కార్యదర్శి చరణ్ రాజ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ జ్ఞాన జ్యోతి, రాజ్యాంగ నిర్మాత, న్యాయ కోవిదుడు, బడుగు బలహీన వర్గాల రక్షకుడు, సమసమాజ స్థాపకుడని కొనియాడారు. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు.

## ఉసిరికపల్లిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



సందేశం టైమ్స్, వట్పల్లి మండలం, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు.

## నారాయణఖేడ్‌లో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు




సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు సబ్ కలెక్టర్ ఉమ హారతి ఐఏఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది పాల్గొని అంబేద్కర్ ఆశయాలను స్మరించుకున్నారు. సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అంబేద్కర్ చూపిన విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజు పటేల్, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాధవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు జైపాల్, సుధాకర్, సర్వేయర్లు మల్లేశం, రాజు, లక్ష్మణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎఎస్ఐ కుటుంబాన్ని పరామర్శించిన ఎస్పీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 15, ప్రతినిధి: మానూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎఎస్ఐ గోవింద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ అంత్యక్రియలకు హాజరై మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో ఉన్న సమయంలో జరిగిన ఈ దుర్ఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. గోవింద్ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఆయనకు రావలసిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎస్ఐలు కోటేశ్వర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ఎస్పీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్ భారత రత్న, రాజ్యాంగ శిల్పి, సంఘ సంస్కర్తగా అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని ఆయన కొనియాడారు. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పోలీసు శాఖ రాజ్యాంగ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐలు రాజశేఖర్ రెడ్డి, డానియోల్, సురేష్, ఎస్బీ ఎస్ఐ సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక న్యాయానికి అంబేద్కర్ మార్గం ఆదర్శం: మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణ కోసం అంబేద్కర్ చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. రాజ్యాంగ రూపకర్తగా దేశ నిర్మాణంలో ఆయన చేసిన సేవలు అపారమని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలకు కట్టుబడి సంక్షేమ పథకాల ద్వారా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ ఛైర్పర్సన్ కూన వనిత సంతోష్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంజయ్య, అడిషనల్ కలెక్టర్ పాండు, అఖిలేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింగూర్ గురుకులంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు




సందేశం టైమ్స్, పుల్కల్, ఏప్రిల్ 15, ప్రతినిధి: అందోల్ నియోజకవర్గం పరిధిలోని సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూర్ గురుకుల హాస్టల్‌లో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతిజ్ఞ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే తాము ఈ స్థాయికి చేరుకున్నామని, ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగుతామని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్నే సోమేశ్వర్, మన్నే వినయ్, మన్నే వర్షిత్, అర్జున్, సింగూర్ దుర్గారామ్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక సేవల వారోత్సవం ప్రారంభం – అగ్ని భద్రతపై అవగాహన కార్యక్రమాలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో అగ్నిమాపక సేవల వారోత్సవం ప్రారంభమై, జిల్లా వ్యాప్తంగా అగ్ని భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి. నాగేశ్వరరావు తెలిపారు. 1944 బాంబే అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బందిని స్మరించుకుంటూ ఏప్రిల్ 14 నుంచి 20 వరకు ఈ వారోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు తదితర ప్రాంతాల్లో మాక్ డ్రిల్లులు, అవగాహన ర్యాలీలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమ ప్రారంభోత్సవంలో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి, సంజీవ రెడ్డి, సబ్ కలెక్టర్ ఉమా హారతి తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది జిల్లాలో 576 అగ్ని ప్రమాదాలు సంభవించగా, సుమారు రూ.5.09 కోట్ల ఆస్తిని రక్షించడంతో పాటు 63 మంది ప్రాణాలను కాపాడినట్లు అధికారులు వెల్లడించారు.



## ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్, సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా సంస్థ సభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవతా సేవలను చాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. అఖిల్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ సమానత్వం, న్యాయం, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

## అంబేద్కర్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకం



సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని మర్వెల్లి గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ చైర్మన్ మఠం బిక్షపతి, మాజీ ఎంపీటీసీ టీ. సంగన్న, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మన్నె జగదీశ్వర్, రమేష్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.



## జహీరాబాద్‌లో ఎస్‌జీటీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

సందేశం టైమ్స్, జహీరాబాద్, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 135వ డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ పిలుపు మేరకు ఎస్‌జీటీయూ యూనియన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య, టౌన్ అధ్యక్షుడు మొహమ్మద్ షెకీల్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల తగ్గింపు వంటి అంశాలు అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వై. అమృత్, హీరాలాల్, శ్రీనివాస్, యూసుఫ్, శివకుమార్, నారాయణ, డా. శివశేఖర్, దేవి సింగ్, విశ్వనాథ్, దయాకర్ తదితర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పుల్కల్ సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీపై తనిఖీ – సరఫరా వేగవంతం చేయాలని ఆదేశాలు



సందేశం టైమ్స్, పుల్కల్, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లోని సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 1275 మంది వినియోగదారులు బుకింగ్ చేసుకున్నప్పటికీ కేవలం 290 సిలిండర్లు మాత్రమే డెలివరీ అయినట్లు, ఇంకా 988 బుకింగ్స్ పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై డీసీఎస్ఓ సంబంధిత గ్యాస్ కంపెనీ సేల్స్ అధికారితో మాట్లాడి వెంటనే సరఫరా వేగవంతం చేయాలని ఆదేశించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సిలిండర్లు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏజెన్సీ వద్ద 40–50 సిలిండర్లు స్టాక్‌లో ఉంచాలని, అలాగే ఏప్రిల్ 15 నాటికి 344 సిలిండర్లు, ఏప్రిల్ 16 నాటికి పూర్తి సరఫరా చేయాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

## జోగిపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం, ఏప్రిల్ 15, 2026, ప్రతినిధి: జోగిపేట పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణా రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ సమాజంలో సమానత్వం, న్యాయం కోసం చేసిన కృషి అపారమని కొనియాడారు. ఆయన రచించిన భారత రాజ్యాంగం దేశ ప్రజలకు హక్కులు, స్వేచ్ఛలను అందించిందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాజంలోని అసమానతలను తొలగించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అరైవ్ అలైవ్"తో రోడ్డు భద్రతపై అవగాహన – ఐఐటీ హైదరాబాద్‌లో కార్యక్రమం





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 15, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం రెండో రోజు ఐఐటీ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరిగా అలవర్చుకోవాలని, ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం మానుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ యువతలోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాదచారులు, సైకిల్ రైడర్లకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి డ్రైవర్ బాధ్యత అని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటిస్తేనే "అరైవ్ అలైవ్" లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు అంజి రెడ్డి, కొమురయ్య, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ఐపీఎస్, జిల్లా కలెక్టర్ ప్రావిణ్యాతో పాటు ఐఐటీ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బుడ్డాయిపల్లిలో అంబేద్కర్ జయంతి ఘనంగా – దళితబంధు వాహనాలతో భారీ ర్యాలీ



సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం వట్పల్లి మండలం బుడ్డాయిపల్లి గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళితబంధు లబ్ధిదారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.గ్రామస్తులు తమ సొంత నిధులతో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి 'పే బ్యాక్ టు సొసైటీ' ఆశయాన్ని ఆచరణలో చూపించారు. దళితబంధు పథకం ద్వారా పొందిన ట్రాక్టర్లు, కార్లు తదితర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించి తమ ఆర్థిక స్వావలంబనను ప్రతిబింబించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ దళితబంధు పథకం అంబేద్కర్ కలల ఆర్థిక సమానత్వానికి దోహదపడుతోందని పేర్కొన్నారు. దళితులు తమ ఆదాయంలో భాగాన్ని సమాజ సేవకు వినియోగించడం అభినందనీయమని అతిథులు తెలిపారు. గ్రామ సర్పంచ్ నాగమణి నర్సింలు, మాజీ ఎంపీటీసీ సదానందం, వట్టిపల్లి మండల మైనార్టీ అధ్యక్షుడు షాపొద్దీన్, స్థానిక నాయకులు, యువజన సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.




## రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకం: మంత్రి పొన్నం ప్రభాకర్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 15, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కంది మండలంలోని ఐఐటీ ప్రాంగణంలో రవాణా మరియు రోడ్లు & భవనాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన "అరైవ్–అలైవ్" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 13 నుంచి 18 వరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అవసరమని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేసే సమస్యగా మారాయని పేర్కొంటూ, చిన్నప్పటి నుంచే రోడ్డు భద్రతను పాఠ్యాంశంగా చేర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి పరిష్కార చర్యలు చేపడుతున్నామని, బాధితులకు సాయం చేసే వారికి ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు.

మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 1.8 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రమాద సమయంలో వీడియోలు తీయకుండా బాధితులను ఆసుపత్రికి తరలించాలని సూచించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి రోజుకు లక్షలాది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నామని చెప్పారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి జాతీయ రహదారులపై హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని సూచించగా, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత పోస్టర్లు ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బహిరడన్ దిబ్బ గ్రామంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, అల్లాదుర్గం, ఏప్రిల్ 14, ఇంచార్జి: అనిల్ కుమార్: అల్లాదుర్గ్ మండల పరిధిలోని బహిరడన్ దిబ్బ గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కూడలి వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్ యువజన నాయకులు మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని, సమాన హక్కులు మరియు సామాజిక సమగ్రత సాధన కోసం అందరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభు, పాపయ్య, చంద్రయ్య, స్వరూప, అంబేద్కర్ యువజన నాయకులు మరియు గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 15, ప్రతినిధి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మెదక్ పట్టణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాందాస్ చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ అడుగు జాడలలో నడుస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలని, ప్రపంచంలో అనేక దేశాలు సాధించలేని స్వేచ్ఛను భారతదేశం సాధించిందంటే అది అంబేద్కర్ కృషి ఫలితమని పేర్కొన్నారు. అన్ని దేశాల అనుభవాలను సమీకరించి రూపొందించిన భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిందని, ఆయన రచనలు ప్రతి ఒక్కరి జీవితాలను ప్రభావితం చేశాయని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వాన్ని ప్రసాదించి సమాజంలో శాంతి, అభివృద్ధికి దోహదపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జో.జి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, అంబేద్కర్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘన నివాళులు – రాంసాన్‌పల్లిలో కార్యక్రమం

సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండలం, ఏప్రిల్ 15, ప్రతినిధి: మెదక్ నియోజకవర్గ పరిధిలోని సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలో మన్నే పోచయ్య ఇంటి వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి, ఆయన ఆశయాలను కొనసాగించాలని, అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే ఈరోజు ప్రజలందరూ స్వేచ్ఛగా, ధైర్యంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, సందేశం టైమ్స్ ప్రతినిధి, సంగారెడ్డి జిల్లా వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నే పోచయ్యతో పాటు నర్సమ్మ, హేమలత, పప్పీ, ప్రియాంక, నవీన్ కుమార్, మహేష్, సునంద, శివయ్య, పార్వతమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

## గ్రామాల్లో ఘనంగా వేడుకలు





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 15, ప్రతినిధి: నర్సాపూర్ మండలం జక్కపల్లి గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించి అంబేద్కర్ ఆశయాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో దళితరత్న అవార్డు గ్రహీత జమునగల్ల కుమార్, గ్రామ సర్పంచ్ భారత్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సెక్రటరీ స్రవంతి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత మరియు అంబేద్కర్ యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా అల్లాదుర్గ్ మండలం మాందాపురం గ్రామంలో కూడా అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. గ్రామ పెద్దలు, సర్పంచ్, ఉపసర్పంచ్, యువకులు, గ్రామ ప్రజలు కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అందరూ కలిసికట్టుగా అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలే తక్షణ కర్తవ్యంగా భావించాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 15, ప్రతినిధి: మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ముందు నేషనల్ హైవే 765-DG రోడ్డు మరమ్మత్తుల పనులను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, నేషనల్ హైవే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలే తక్షణ కర్తవ్యంగా భావించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి వాహనదారులకు సురక్షిత ప్రయాణం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణ లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, నేషనల్ హైవే డీఈ ప్రవీణ్ రెడ్డి, ఈఈ కరుణ తదితరులు పాల్గొన్నారు.

# వడగాలుల నియంత్రణకు సమగ్ర కార్యాచరణ – ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపు



సందేశం టైమ్స్ (మెదక్ నియోజకవర్గం ప్రతినిధి) ఏప్రిల్ 16: వేసవి కాలంలో ఎండ తీవ్రత మరింత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. జిల్లా కేంద్రంలో వడగాలుల (హీట్‌వేవ్) నియంత్రణపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమీక్షించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో తాగునీటి సరఫరా, చలివేంద్రాల ఏర్పాటు, ఆరోగ్య కేంద్రాల్లో ORS మరియు అవసరమైన మందుల అందుబాటు, బహిరంగ ప్రదేశాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా కార్మికులు, వృద్ధులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు వంటి సున్నిత వర్గాల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే పుష్కలంగా నీరు, మజ్జిగ, కొబ్బరినీరు వంటి ద్రవాలు తీసుకోవాలని, తేలికపాటి పత్తి దుస్తులు ధరించాలని తెలిపారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, పనిస్థలాలు, పాఠశాలలు, వ్యవసాయ రంగాల్లో నీడ మరియు తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచిస్తూ, వడగాలుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా – బీసీ సంక్షేమ సంఘం ఘన నివాళులు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 15 (మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు సంగారెడ్డి జిల్లా పాత బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు ప్రభు గౌడ్, ప్రధాన కార్యదర్శి పార్వతికృష్ణ, జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ స్వామి, ఉపాధ్యక్షులు కవేలి ఆంజనేయులు, జగ్గా సింగ్, జిల్లా కార్యదర్శి సుధాకర్ గౌడ్, శ్రీనివాస్, ప్రవీణ్ యాదగిరి, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, బీసీ జేఏసీ కన్వీనర్ కుమ్మరి సాయిలు, మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి వీరమణి, వర్కింగ్ ప్రెసిడెంట్ మానస, అధికార ప్రతినిధి మంగ గౌడ్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగభూషణం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభు గౌడ్ మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పోరాడిన మహానుభావుడని, సమానత్వం కోసం రాజ్యాంగాన్ని రచించిన మహా నాయకుడని కొనియాడుతూ ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.